క్లుప్తంగా

ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ప్రింట్ చేయొద్దు

గుత్తి: ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ప్రింట్ చేయొద్దని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ప్లాస్టిక్ ఫ్లెక్సీ షాపు యజమానులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఫ్లెక్సీ షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీలను పూర్తిగా నిషేధించిందన్నారు. తమ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫిబ్రవరి 6న మాజీ ఎమ్మెల్యే భీమిరెడ్డి విగ్రహావిష్కరణ

గుంతకల్లుటౌన్: పట్టణ శివార్లోని కొనకొండ్ల రోడ్డులో ఫిబ్రవరి 6వ తేదీన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి విగ్రహ ఆవిష్కరణ, భీమా పార్కును ప్రారంభించనున్నట్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ పెద్దలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, భీమిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వీరభద్రస్వామి, సీఐటీయూ పట్టణాధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. పీహెచ్ వర్కర్లతో ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లు లేవని, ఉన్నా వారికి ఆపరేట్ చేయడం రాదని, దీంతో ఫేషియల్ మస్టర్ నుంచి వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రిటైర్డ్ అయిన కార్మికులకు ప్రభుత్వ బెనిఫిట్స్‌ను వెంటనే అందేలా చూడాలన్నారు. నాయకులు నరసయ్య, కొండయ్య, తిమ్మప్ప, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

పుట్లూరు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా కూలీల సంఖ్యను 2 వేలకు పెంచాలని, ఇందు కోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ చెన్నకేశవులు, ఇన్‌చార్జ్ ఈసీ విజయ్, సాంకేతిక, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై 'ప్రజావేదిక'

గుత్తి రూరల్: ఉపాధి హామీ సామాజిక తనిఖీలపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక(బహిరంగ సభ) నిర్వహించారు.

మండలవ్యాప్తంగా 2020-21, 2021-22 సంవత్సరంలో రూ.11.33 కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. అందులో పంచాయతీ రాజ్, సెర్ప్, హార్టికల్చర్, అనిమల్ హస్బెండరీ, ఉపాధి హామీ, అటవీ, హౌసింగ్, పింఛన్, అభయహస్తం, బీమా పంపిణీకి సంబంధించి తనిఖీ వెల్లడైన విషయాలను తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో పనులు చేయకపోయినా డబ్బు డ్రా చేసినట్లు తెలియజేశారు. దీంతో అధికారులు బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ వెంకటనాయుడు, ఎంపీపీ విశాలాక్షి, ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఏపీఓలు మద్దిలేటి, రమేశ్, టీఏలు మల్లికార్జున, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడిగా రామాంజనేయు

గుత్తి: పట్టణంలోని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యాలయంలో బుధవారం కమిటీ సభ్యులు సమావేశం జరిగింది. గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చౌదరి విజయ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడిగా రాయల్ డాబా నిర్వాహకుడు ఆదినేని రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గుత్తి కోట సంరక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రామాంజనేయులు పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



తాడిపత్రి టౌన్ జాతీయ ఓటు దినోత్సవంపై ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



గుత్తి రూరల్ : రెవెన్యూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ మహబూబ్ బాషా

తాడిపత్రి టౌన్ : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, ఎంపీడీఓ రంగారావు, ఎంఈఓ నాగరాజు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు ఓటు హక్కు, ఓటు నమోదు, ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల నుంచి సీబీరోడ్డు మీదగా అశోక్ పిల్లర్ వరకు ర్యాలీగా వెళ్లి మానవ హారంగా ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకుడు హరిప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక పాతకోట వార్డు సచివాలయం వద్ద వార్డు సెక్రటరీలు, వలంటీర్లు జాతీయ ఓటరు దినోత్సవంపై ప్రతిజ్ఞ చేశారు.

యల్లనూరు: ఓటు హక్కు వజ్రాయుధమని డిప్యూటీ తహసీల్దారు శ్వేత పేర్కొన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దారు కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహబూబ్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్ హాజీవలి ఆధ్వర్యంలో మండలంలోని 79 పోలింగ్ బూత్‌లలో బీఎల్ఓలు 1-1-2023లోపు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులతో ఓటరుగా నమోదు చేశారు. తహసీల్దార్, డీటీలు ఆర్ఐ, వీఆర్ఓ, వీఆర్ఏ, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. డీటీ శ్రీలత, ఆర్ఐ సందీప్, వీఆర్ఓలు, ఊబిచెర్ల సర్పంచ్ చిదంబరి పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటిదని శంకరానందగిరీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పీ.గోపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకుంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభద్రమ్మ, అధ్యాపకులు బీ వెంకట నారాయణరెడ్డి, రఫీ, రాము, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ సురేష్ బాబు బుధవారం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, వీఆర్ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పారిశుద్ధ్య కార్మికులు, అధికారులకు సూచించారు. గుంతకల్లు మండలంలోని 25 పంచాయతీలకు 25 ట్రైసైకిళ్లను ప్రభుత్వం మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీపీ బీవీ మాధవి, ఎంపీడీవో జాషువా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాటిని పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉన్నపుడే ప్రజారోగ్యం మెరుగవుతుందన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పారిశుద్ధ్య మెరుగుకు సిబ్బంది అందరూ కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఏ చిన్న అనారోగ్య సమస్య తలెత్తిన వెంటనే గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారానికి ఒక రోజు చొప్పున 104 వాహన సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ పర్యటించి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, అవసరమైన వైద్యం అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, మండల సచివాలయ కన్వీనర్ గోవిందు నాయక్, కో ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



బందార్లపల్లిలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

పెద్దవడుగూరు : బందార్లపల్లిలో బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో 150 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతోపాటు నియోజవకర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో రామాంజినేయులు, రంగస్వామి, హనుమంతు, రామాంజినేయులు, నాగరాజు, ఆదినారాయణ, ఓబుళరెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ గూడూరు పెద్ద ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పెద్దవడుగూరు : బందార్లపల్లి గ్రామ ప్రజల ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించడానికి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి నడుం బిగించారు. బుధవారం ఆయన గ్రామస్తుల అభ్యర్థన మేరకు బందార్లపల్లి - వీరేపల్లి ప్రధాన రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. రహదారి పనులు త్వరగా పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

నేటి నుంచి 'సంక్షేమ యాత్ర'

పెద్దవడుగూరు : తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజా సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా సంక్షేమ యాత్రకు శ్రీకారం చుట్టారు. మండలంలోని కాశేపల్లి నుంచి గురువారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మొదటి రోజు : కాశేపల్లి నుంచి ఉదయం 8 గంటలకు ప్రజా సంక్షేమ పాదయాత్ర ప్రారంభమై గుత్తి అనంతపురం, కొత్తపల్లి, విరుపాపురం, మీదుగా అవులాంపల్లి కి చేరుకుంటుంది.

27న : జి.వెంకటాంపల్లి, మల్లేనిపల్లి మీదుగా లక్ష్మంపల్లికి చేరుకుంటుంది.

28న : లక్ష్మంపల్లి నుండి ప్రారంభమై ముప్పాల గుత్తి, బుర్నాకుంట మీదుగా బందార్లపల్లి కి చేరుకొంటుంది.

30న : బందార్లపల్లి నుంచిప్రారంభమై యాత్ర అప్పేచర్ల మీదుగా కడదరగుట్టపల్లి, క్రిష్టిపాడు గ్రామాల మీదుగా కొండుపల్లికి చేరుకుంటుంది.

31న : కొండుపల్లి నుంచి భీమునిపల్లి గ్రామం మీదుగా రావులుడికి గ్రామానికి చేరుకుంటుంది.

ఫిబ్రవరి 1న : రావులుడికి నుంచి కోనాపురం, చింతలచెరువు, తెలికి మీదుగా మేడిమాకులపల్లికి చేరుకుంటుంది.

2న : కండ్లగూడూరు నుంచి సి. రామరాజుపల్లి మీదుగా రాంపురం చేరుకుంటుంది.

3న : రాంపురం నుండి మొళకతాళ్ల, చిత్రచేడు మీదుగా చిట్టూరు కోనేరు వద్ద చేరుకుంటుంది.

4న : చిట్టూరు కోనేరు నుంచి చిట్టూరు, గంజిగుంటపల్లి, నాగలాపురం మీదుగా పి.వీరన్నపల్లికి చేరుకుంది.

6న : పి.వీరన్నపల్లి నుంచి కొట్టాలపల్లి మీదుగా దిమ్మగుడికి చేరుకుంటుంది.

7న : దిమ్మగుడి నుంచి చిన్నవడుగూరు మీదుగా పెద్దవడుగూరుకి చేరుకుంటుంది. సాయంత్రం పెద్దవడుగూరులో భారీ బహిరంగ సభతో కార్యక్రమం ముగియనుంది.

భక్తిశ్రద్ధలతో కాశీ విశ్వేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట



కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: రాయలచెరువులో బుధవారం కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం వద్ద వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. అనంతరం యంత్ర, బింబ, ప్రాణ ప్రతిష్టాపన, నేత్రోన్మీలనం చేపట్టారు. హరికృష్ణ శర్మ, రుద్రయ్య ఆధ్వర్యంలోని రుత్వికుల మంత్రోచ్చారణల మధ్య స్వామి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సర్పంచు తలారీ అరుణ, నాగేష్ దంపతులు, వైస్ ఎంపీపీ హసీనాభేగం రషీద్ దంపతులు, మాజీ జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, సీవీ రమణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తప్పిన ప్రమాదం

పామిడి: రోడ్డుపైకి ట్రాక్టర్ దూసుకొచ్చిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో అమీర్ అనే వ్యక్తి ట్రాక్టర్ల మరమ్మతు చేస్తుంటాడు. బుధవారం ఉదయం ఓ ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి బయటకు వెళ్లాడు. ట్రాక్టర్ ఒక్కసారిగా గేర్ మారడంతో రోడ్డుపైకి దూసుకొచ్చింది. అయితే శేషారెడ్డి ఆటో మొబైల్ షాపుల వద్ద ఉన్న బైక్‌లను ఢీకొని ఆగిపోయింది. దీంతో స్థానికులు ఊపరిపీల్చుకున్నారు.

రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ మృతికి సంతాపం

తాడిపత్రి టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విశ్రాంత మున్సిపల్ కమిషనర్ రాంమోహన్ మృతికి తాడిపత్రి మున్సిపల్ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా రాంమోహన్ పనిచేశారు.

పూర్వాభాద్ర హోమం

గుంతకల్లు రూరల్: ఆంజనేయస్వామి జన్మనక్షత్రం అయిన పూర్వాభాద్రను పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం పూర్వాభాద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో స్వామి ఉత్సవ మూర్తిని కొలువదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు హోమాన్ని పూర్తి చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

జామియా మసీదు నూతన కమిటీ ఎన్నిక

యాడికి: స్థానిక జామియా మసీదు నూతన కమిటీని బుధవారం రాత్రి ఎన్నుకున్నారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్ మోహిద్దీన్ అధ్యక్షతన సీఐ రామకృష్ణ, ఇన్‌చార్జ్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ సమక్షంలో జామియా మసీదు ముతవల్లిగా మహమ్మద్ షాషావలి బాధ్యతలు చేపట్టారు. వైస్ ముతవల్లిగా మహమ్మద్ రఫి, జాయింట్ సెక్రటరీగా ఖాజామోహిద్దీన్, సభ్యులుగా ఫజుల్, వేములపాడు షెక్షావలి, ఖాదర్ వలి, నిజాముద్దీన్, హల్ది, మహబూబ్ బాషా, పి.షెక్షావలి ఎన్నికయ్యారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

బుక్కరాయసముద్రం: రైతులు పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టీవీ సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం ఎస్.కొండాపురంలో పాడి పశువుల్లో గర్భాశయ వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పశువులకు మంచి దాణా ఇవ్వాడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందయన్నారు. అనంతరం పశువులకు చికిత్స నిర్వహించారు. బీకేఎస్ పశు వైద్య సంచాలకులు డాక్టర్ రత్నకుమార్, వెటర్నరీ డాక్టర్లు రాధిక, వినోద్‌కుమార్, సోమేశ్వరి, పెద్దన్న, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

కల్వర్టు మరమ్మతు చేయించండి



కల్వర్టును పరిశీలిస్తున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 31వ వార్డు బెంచికొట్టాల మీసేవా కేంద్రం దారిలో దెబ్బతిన్న కల్వర్టులను మరమ్మతులు చేయించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి తెలిపారు. బుధవారం వార్డు కౌన్సిలర్ నగేష్ విజ్ఞప్తి మేరకు మున్సిపల్ డీఈ, ఏఈలతో కలిసి ఆమె వార్డులో పర్యటించి దెబ్బతిన్న డ్రైనేజీలు, కల్వర్టులను పరిశీలించారు. డీఈ హేమచంద్ర, ఏఈ షబానా, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టండి

యల్లనూరు: విద్యార్థులకు ఆకుకూరలు, కూరగాయలతో రుచికరమైన భోజనాలను వండి పెట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. చిలమకూరు ఆదర్శపాఠశాలను బుధవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన ఆహారాన్ని రుచి చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెద్దమల్లేపల్లిలో ప్రభుత్వ భవన నిర్మాణాలను మండల ఇంజనీరు నరేంద్రతో కలిసి పరిశీలించారు. ప్రిన్సిపాల్ వెంకటపతి, పీఈటీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల హాజరు పెంచండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో కూలీల హాజరును పెంచాలని ఏపీఓ షబ్బీర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులను కల్పించాలన్నారు. ఈసీ బబ్లు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గుత్తి: తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఏసీడీపీఓ ఢిల్లీశ్వరి అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర ఫరా అవుతున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సకాలంలో ఇవ్వాలన్నారు. సూపర్‌వైజర్లు నాగేశ్వరి, ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

యల్లనూరు: తిమ్మంపల్లి కెనరాబ్యాంకు సమీపంలో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్న లోకేశ్వరరెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దాడి చేశారు. యజమానికి గుర్తుతెలియని వ్యక్తులకు వాగ్వాదం జరిగి దాడి వరకు వెళ్లింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ బుధవారం దుకాణం వద్దకు చేరుకుని బాధితులతో వివరాలను తెలుసుకున్నారు.

మహిళ మృతి

గుత్తి రూరల్: అబ్బేదొడ్డిలో బుధవారం పార్వతమ్మ(54) అనే మహిళ ఇంట్లో కుప్పకూలి మృతి చెందింది. మృతురాలి భర్త కోదండరామిరెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కోదండరామిరెడ్డి, పార్వతమ్మ దంపతులు వ్యయసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో పార్వతమ్మ ఇంట్లో కుప్పకూలి పడిపోయింది. తోట నుంచి తిరిగి వచ్చిన భర్త ఇంటో అపస్మారక స్థితిలో పడి ఉన్న పార్వతమ్మను గమనించి స్థానికుల సాయంతో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పార్వతమ్మ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఇరువర్గాల ఘర్షణ

తాడిపత్రి: యర్రగుంటపల్లి గ్రామంలో బుధవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్ఐ కాటయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన తిప్పారెడ్డి, అతడి కుమారుడు సూర్యనారాయణ పక్క ఇంటిలో ఉండే చంద్రశేఖర్, అతడి సోదరుడు శ్రీనివాసులు మధ్య ఇంటి ముందు చెత్త, నీటి విషయమై గొడవకు దిగారు. మొదట తిప్పారెడ్డిపై చంద్రశేఖర్, సోదరుడు శ్రీనివాసులు కలిసి దాడి చేశారు. దీంతో తిప్పారెడ్డి కుమారుడు తండ్రిని కొట్టారన్న కోపంతో తర్వాత తండ్రితో కలసి చంద్రశేఖర్, శ్రీనివాసులుపై దాడి చేశారు. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్



ఎమ్మెల్యే పెద్దారెడ్డిని సన్మానిస్తున్న రిజ్వాన్

తాడిపత్రి: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని మైనార్టీ నాయకులు, తాడిపత్రి వక్ఫ్‌బోర్డు మెంబర్లతో కలసి ఆయన తాడిపత్రిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వక్ఫ్‌బోర్డు చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రిజ్వాన్‌తో ఆరా తీశారు. అనంతరం అక్కడే ఉన్న యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డితో మాట్లాడారు. అంతకుముందు కార్యాలయానికి వచ్చిన రిజ్వాన్‌ను స్థానిక వక్ఫ్‌బోర్డు సభ్యులు, మైనార్టీ నాయకులు సన్మానించారు. కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌భాష, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు ఆసిఫ్, నాయకులు ఖాదర్‌భాష, మహీత్‌బిన్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాయలసీమ సహాయ కార్యదర్శిగా రమేష్

గుత్తి: పట్టణంలోని కోట వీధికి చెందిన దాసా రమేష్‌కుమార్ పద్మశాలి సంఘం రాయలసీమ సహాయ కార్యదర్శిగా, పెద్దయ్య రాయలసీమ కార్యనిర్వాహక సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు పద్మశాలి సంఘం రాయలసీమ అధ్యక్షులు లక్ష్మీనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీయ కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

ఎస్ఆర్ఐటీ ప్రొఫెసర్‌కు ఉత్తమ అవార్డు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ షేక్ శర్మస్ వలి అత్యుత్తమ థీసిస్, డిసర్టేషన్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. మొరాకోలోని సుల్తాన్ మౌలేస్మిన్ యూనివర్సిటీ మలేషియాలోని సిటీ యూనిర్సిటీ సహకారంతో జార్ఖండ్‌లోని రామ్‌ఘర్‌లో జనవరి 21, 22 తేదీల్లో అడ్వాన్స్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్,అప్లికేషన్ (ఏఓటీఏ) 1వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో షేక్ శర్మస్‌వలి అవార్డు అందుకున్నారు. అవార్డుగ్రహీతను ప్రిన్సిపాల్‌తోపాటు మెకానికల్ ఇంజినీరింగ్ అధిపతి డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రొఫెసర్ జయపాల్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తోందని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం దేవరకొండ వద్ద జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పర్యాటక శాఖ ఎంతో కీలకమన్నారు. పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని క్విజ్, వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. అంతకుముందు పర్యాటక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి యువకులు దేవరకొండ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆలూరి రమణారెడ్డి, మనేరి కొండమ్మ తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.